క్లుప్తంగా

గృహ నిర్మాణాలపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న హౌసింగ్ డీఎం శ్రీనివాసరావు

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జగనన్న కాలనీ గృహ నిర్మాణాలపై హౌసింగ్ డీఎం వి.శ్రీనివాసరావు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలన్నారు. నిర్మాణాల ప్రగతికి సంబంధించి, రోజుకో నిర్మాణ దశను అప్‌లోడ్ చేయాలని ఇంజినీరింగ్ సహాయకులకు సూచించారు. నవంబరు నెలాఖరు నాటికి ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఈఈ అప్పయ్య, ఎంపీడీవో అంజనేయులు, ఏఈ సత్యం తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో మొలకశాతం మెరుగు



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం: మండలంలోని గార్రాజు చీపురుపల్లి యూనిట్ పరిధిలో మారేడుబాక గ్రామంలో రైతులకు విత్తనశుద్ధిపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతిలో అందుబాటులో ఉండే పదార్థాలతో బీజామృతాన్ని ఎలా తయారు చేసుకోవాలి, విత్తనాలను ఎలా శుద్ధి చేసుకోవాలి, తదితర అంశాలను వివరించారు. రబీలో సాగుచేసే పెసర, మినప తదితర పంటల విత్తనాలను ఈ బీజామృతంతో ముందుగానే శుద్ధిచేసుకోవాలని సూచించారు. తద్వారా మొలక శాతం పెరగడంతో పాటు చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఎల్1 రమాదేవి, ఐసీఆర్పీ శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత వేణుగోపాలనాయుడు

బొబ్బిలి: మండలంలోని కొండదేవుపల్లి గ్రామంలో అవసరమైన చోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నేత శంబంగి వేణుగోపాలనాయుడు శుక్రవారం భూమిపూజ చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, అన్ని ప్రాంతాల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని ఆయన అన్నారు. ప్రతీ గ్రామంలో గ్రామ సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి



అంబఖండిలో వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ హరనాథరావు

రేగిడి: ఉపాధిహామీ పనులు చేస్తున్న వేతనదారులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ నంబర్ అనుసంధానం చేసుకోవాలని ఏపీఓ ఎస్.హరనాథరావు సూచించారు. మండలంలోని అంబఖండి, సోమరాజుపేట, ఉంగరాడ తదితర గ్రామాల్లో వేతనదారులకు ఆధార్ అనుసంధానంపై శుక్రవారం అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం ఉంటేనే డబ్బులు ఖాతాల్లో పడతాయని, లేకుంటే డబ్బులు రావని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు బాధ్యతగా పని చేయాలని సూచించారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

రేగిడి: గ్రామాల్లో తాగునీటి బోర్లకు మరమ్మతులు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ అన్నారు. మండలంలోని అక్కన్నఅగ్రహారం, లక్ష్మీపురం, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వన్నలి తదితర గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లను శుక్రవారం మరమ్మతులు చేయించారు. ఆయా గ్రామాల పంచాయతీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో బోర్లు బాగుచేస్తున్నట్లు చెప్పారు.

ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శన



ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న సిబ్బంది

రాజాం సిటీ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ముసాయిదా ఓటర్ల జాబితాను శుక్రవారం ప్రచురించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్‌కే రాజు మాట్లాడుతూ ఓటర్లు జాబితాలో తమ పేరు, వివరాలు సరిచూసుకోవాలని కోరారు. జాబితాలో పేరు లేకపోయినా, సవరణల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 4,5, డిసెంబర్ 2,3 తేదీల్లో బూత్‌లెవెల్ అధికారులంతా అందుబాటులో ఉంటారని, ఎదైనా చేర్పులు మార్పులకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఊరిలోనే మెరుగైన వైద్యం

ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్య సేవలందించాలనే లక్ష్యంతో గ్రామాల్లో నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఈ శిబిరాల్లో నిపుణులైన వైద్యులచే వివిధ రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులను ఉచితంగా అందిస్తున్నారు. రాజాం, బొబ్బిలి నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. రోగులకు మందులు, హెల్త్ రిపోర్టులు అందజేశారు.

– సాక్షి రాజాం, బొబ్బిలి



రేగిడి: తోకలవలసలో ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు మెడికల్ కిట్లు అందిస్తున్న వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు



రేగిడి: తోకలవలస ఆరోగ్య శిబిరం వద్ద పౌష్టికాహారంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



తెర్లాం: వెలగవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో తనిఖీలు చేయించుకునేందుకు క్యూలైన్‌లో ఉన్న రోగులు



తెర్లాం: వెలగవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని చింతాడ వీధిలో జగనన్న ఆరోగ్య సురక్ష మందుల కిట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు



బొబ్బిలి: బొబ్బిలిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు

టీడీపీ నేతలు వాస్తవాలు గ్రహించాలి

బాడంగి: టీడీపీ నేతలు వాస్తవాలు గ్రహించాలని, అవేమీ చేయకుండా ప్రభుత్వ అభివృద్ధి పనులపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు, డొంకినవలస సచివాలయ కన్వీనర్ గండి శంకరరావు, పింద్రంగివలస సర్పంచ్ ప్రతినిధి రావాడ తిరుపతి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ చాంబరులో విలేకరులతో మాట్లాడిన ఆయన మండల కేంద్రమైన బాడంగితో పాటు కోడూరు గ్రామానికి చెందిన టీడీపీ నేతలు అవగాహన లేకుండా ప్రభుత్వం, ప్రభుత్వ పనులపై ఆరోపణలు చేస్తూ అధికారులకు పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించడం తగదన్నారు. బాడంగి, కోడూరు, బీసీ కాలనీకి తాగునీటి కొరత లేదని, పాల్తేరు వేగావతి నుంచి దత్తిరాజేరు మండలానికి వెళ్తున్న ప్రాజెక్టు ద్వారా



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రామారావు తదితరులు

గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలకు తాగునీరు సరఫరా జరుగుతోందన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు వేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఐదుసార్లు టెండర్లకు పిలిచిందని, అయినా ఎవ్వరూ రానందునే పనులు జరగలేదన్నారు. కోడూరు, బాడంగి గ్రామాల్లో కుళాయిల ఏర్పాటుకు తొలుత తక్కువ అంచనా విలువలతో పనులు మంజూరు కాగా దీనిపై అభ్యంతరాల నేపథ్యంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస్ సహకారంతో రూ.కోటిన్నర అంచనా విలువలతో పనులకు టెండర్లకు పిలవడం జరిగిందన్నారు. ఇంకా టెండర్లకు ఎవరూ రాలేదన్నారు. ఇలా తొమ్మిది గ్రామాల్లో పనులు జరగలేదన్నారు. ఇదే విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, సింగిల్ టెండర్లకు అనుమతి ఇచ్చారన్నారు. కోడూరులో సచివాలయ భవనం శ్లాబ్ నిర్మాణం జరిగి, వాటరింగ్ పనులు జరుగుతున్నందున మిగతా పనులు నిలిపివేశామని స్పష్టతనిచ్చారు. ఉపాధి హామీ పథకం ద్వారా కోడూరు బీసీ కాలనీకి, రామచంద్రాపురం చేనేతకార్మికుల కాలనీకి రూ.10 లక్షల విలువైన సీసీ రోడ్లు వచ్చాయని, వీటిని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

భూముల రీసర్వేకు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దారు అజు రఫీజాన్

బాడంగి: భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దారు అజు రఫీజాన్ కోరారు. మండలంలోని పూడివలస గ్రామంలో గ్రౌండ్ ట్రూథింగ్ పనుల ప్రారంభం నేపథ్యంలో ఆ గ్రామంలోని రామమందిరం వద్ద శుక్రవారం రైతులతో సమావేశమైన ఆయన ఎన్నో ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సర్వే చేస్తోందని, ప్రతీ రైతు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సర్వే సమయంలో సంబంధిత రైతులు సర్వే సిబ్బందికి అందుబాటులో ఉండాలని, హక్కు పత్రాలు దగ్గర పెట్టుకుని, వాటి ఆధారంగా సరిహద్దులను సర్వే బృందానికి తెలపాలన్నారు. కొలతలు పూర్తయ్యాక డీఎల్ఆర్ ప్రాప్తికి భూముల సర్వే నంబర్లు, విస్తీర్ణం సరిచూసుకోవాలన్నారు. సమావేశంలో రీసర్వే డీటీ తులసీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హత, ఆసక్తి ఉన్న లబ్ధిదారులను గుర్తించండి

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలని కమిషనర్ డీటీవీ కృష్ణారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీర్లు, హౌసింగ్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా వార్డుల్లో సొంత స్థలం ఉండి ఇంటి నిర్మాణానికి ఆసక్తి ఉన్న లబ్ధిదారులను గుర్తించాలన్నారు. అటువంటి వారికి ప్రభుత్వం అందించే సదుపాయాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

సంక్షిప్తంగా..

నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వేపై అవగాహన

రాజాం: స్థానిక జీసీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, డిగ్రీ విద్యార్థులకు నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వేపై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈఓ యాగాటి దుర్గారావు, ఉపాధ్యాయులు రమణయ్య, శ్రీను అవగాహన కల్పించారు. నవంబర్ 3న రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. డిగ్రీ స్టూడెంట్స్‌తో పాటు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఫెసిలిటీ ఇన్వెస్టిగేటర్స్‌గా వ్యవహరించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు భాస్కరరావు, బి.ఎరకయ్య, జీసీఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పురుషోత్తం, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారమే చెత్త సేకరణ

బొబ్బిలి: పట్టణంలోని ప్రతీ వార్డులో షెడ్యూల్ ప్రకారమే ఇంటింటి చెత్త సేకరణ, కాలువల్లో మురుగు తొలగింపు పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని యాదవ వీధిలో మున్సిపల్ సిబ్బందితో కలిసి, పర్యటించి అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు సక్రమంగా వెలుగుతున్నాయా లేదా అని అడగ్గా వారంతా వెలుగుతున్నాయని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ రమాదేవి తదితరులు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆంజనేయులు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఉదయం 11గంటలకు జరిగే ఈ సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు పాల్గొంటారని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని కోరారు.

'ఈ–క్రాప్' జాబితా ప్రదర్శన

బాడంగి: ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతుల జాబితాను సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించడం జరిగిందని, వాటిలో ఏమైనా పొరపాట్లు ఉన్నా, ఈ–క్రాప్ చేయించుకున్న వారి పేర్లు లేకపోయినా తెలియజేయాలని జెడ్పీటీసీ రామారావు కోరారు. మండలంలోని భీమవరంలో ఈ–క్రాప్ నమోదుకు సంబంధించి, శుక్రవారం జరిగిన సామాజిక తనిఖీల సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ నెల 29వ తేదీ వరకు ఈ సమావేశాలు నిర్వహించనున్నామని, ఏమైనా అభ్యంతరాలుంటే రైతులు తెలియజేయాలన్నారు. బాడంగి, ముగడ, భీమవరం, రేజేరు, గొల్లాది, తెంటువలస, గూడెపువలస, కోడూరు–1, వాడాడ, డొంకినవలస, గజరాయునివలస రైతు భరోసా కేంద్రాల్లో ఈ–క్రాప్ నమోదు జాబితా ప్రదర్శించినట్లు ఏవో శిరీష తెలిపారు.

ఉపాధిహామీ పనుల గుర్తింపు

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామంలోని రామమందిరం వద్ద శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఉపాధిహామీ నిధులతో చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు సర్పంచ్ బత్తుల జ్యోతీశ్వరరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తులు, రైతులకు అవసరమైన పనులను గుర్తించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఓ త్రినాథ్, సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

రాజాం సిటీ: హోటల్స్ యజమానులు నిబంధనలు పాటించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని పలు హోటళ్లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటళ్లలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగించొద్దని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. వినియోగదారులకు ఫ్రిడ్జ్‌లలో నిల్వ ఉంచిన మాంసం విక్రయించొద్దని, వేడినీటిని అందించాలని సిబ్బందికి సూచించారు. నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పైడితల్లి ఉత్సవాల్లో రా.ర.వే

రాజాం సిటీ: విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాజాం రచయితల వేదిక(రా.ర.వే)కు ఆహ్వానం అందినట్లు వేదిక నిర్వాహకులు గార రంగనాథం శుక్రవారం తెలిపారు. మూడు రోజులుపాటు జరగనున్న కార్యక్రమాల్లో 'సాహిత్యం–చరిత్ర' అనే అంశంపై రంగనాథం, 'సాహిత్యం–గ్రామీణ జీవితం' అనే అంశంపై ఆల్తి మోహనరావు ప్రసంగించనున్నారు.

దొంగలు హల్‌చల్

రాజాం సిటీ: పట్టణంలో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. శ్రీకాకుళం రోడ్డు, ఈశ్వర నారాయణ కాలనీల్లో వరుసగా రెండు ఇళ్లల్లో చోరీకి యత్నించారు. ఎవరూలేని సమయంలో ఇళ్లల్లోకి ప్రవేశించి ఏమీ దొరకకపోవడంతో సామగ్రి చిందరవందరగా పడేసి వెళ్లిపోయారు. ఉదయం ఇంటి యజమానులు దొంగలు పడినట్లు గుర్తించారు. అయితే ఎటువంటి నష్టం జరగకపోవడంతో ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు. దూర ప్రాంతాలకు క్యాంపులు వెళ్లే ప్రజలు పోలీసులకు ముందస్తు సమాచారం ఇస్తే ఆయా ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేస్తామని సీఐ తెలిపారు.

మాదిగ సదస్సులను జయప్రదం చేయండి

రామభద్రపురం: ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న కర్నూలు, 20న గుంటూరు, 27న రాజమండ్రి, 31 విశాఖపట్నంలో నిర్వహించనున్న మాదిగ సదస్సులను జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కో–కన్వీనర్ ఎస్.లక్ష్మణరావుతో కలిసి శుక్రవారం ఆయన సదస్సులకు సంబంధించి, రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ అంశంపై రాజ్యాంగ సవరణ జరిగి, వర్గీకరణ చేయాలన్నారు. మాదిగ జాతి యువకులు, విద్యార్థులు, మేధావులు, రాజకీయ నాయకులు ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున సదస్సులకు హాజరు కావాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు

బొబ్బిలి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని అన్ని సచివాలయాల పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన నెరవేర్చాల్సిన లక్ష్యాలను నిర్దేశించారు. ఇదిలా ఉండగా, స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నాయుడు కాలనీ వైపు వెళ్లే కాలువ మురుగు రోడ్డుపైకి రాకుండా చర్యలు చేపట్టారు.

నేడు కోమటిపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులంతా హాజరుకావాలని కోరారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలి

రాజాం సిటీ: మండలంలోని అధికారులంతా ప్రజా సమస్యలపై దృష్టిసారించి తక్షణ పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపీపీ లావేటి సులోచన అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, గెడ్డాపు అప్పలనాయుడు, తదితరులు మాట్లాడుతూ.. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోతున్నాయని, తోటపల్లి కాలువ నుంచి నీరు విడుదల చేయాలని కోరారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందిస్తూ.. సాంకేతిక కారణాలతో నీటి విడుదలలో జాప్యం నెలకొందని, నవంబర్ మొదటివారంలో వారబంధీ ప్రకారం నీటిని విడుదల చేయనున్నట్లు చెప్పారు. అలాగే గ్రామాల్లో జేఎల్‌ఎంలు అందుబాటులో ఉండడం లేదని, దీంతో విద్యుత్ సమస్యలు తీవ్రమౌతున్నాయని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపీడీఓ బాసూరి శంకరరావు 2024–25 ఆర్థిక



మాట్లాడుతున్న ఎంపీపీ లావేటి సులోచన

సంవత్సరానికి సంబంధించి రూ.1.94 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దీనిని సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. అలాగే నవంబర్ నుంచి పన్నుల వసూళ్లను ముమ్మరం చేయాలని ఈఓపీఆర్డీ వి.శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు యాలాల సునీత, తహసీల్దార్ ఎస్‌కే రాజు, విద్యుత్‌శాఖ ఏఈ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ జాబితాలో పేర్లు సరిచూసుకోండి



రేగిడి: ఉప్పర్నాయుడువలసలో ఈ–క్రాప్ జాబితా ప్రదర్శిస్తున్న సిబ్బంది

రేగిడి: ఈ–క్రాప్‌లో నమోదు చేసిన వివరాలను రైతులు పరిశీలించుకోవాలని వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. మండలంలోని ఖండ్యాం, వన్నలి, వండానపేట, ఉంగరాడ తదితర గ్రామాల్లోని ఆర్‌బీకేలను శుక్రవారం ఆయన సందర్శించారు. అక్కడ ఉన్న నోటీసు బోర్డుల్లో ఈ–క్రాప్‌కు సంబంధించి రైతుల వివరాలను పొందుపరిచారు. అందులోని వివరాలను రైతులు సరిచూసుకోవాలని, ఏవైనా తప్పులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

☛ సంతకవిటి: రైతులు సాగుచేస్తున్న పంటలకు సంబంధించి ఈ–క్రాప్ నమోదు జాబితాలు మండలంలోని 24 రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని, రైతులు వాటిని పరిశీలించి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని వ్యవసాయాధికారి పైల నవీన్ అన్నారు. మండలంలోని సంతకవిటి, మోదుగులపేట, వాల్తేరు, జీఎన్ పురం తదితర గ్రామాల్లోని ఆర్‌బీకేలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అభ్యంతరాలు ఉంటే మూడు రోజుల్లోగా సరిచేసుకునేందుకు అవకాశం ఉందని రైతులకు సూచించారు.

☛ ఈ–క్రాప్‌లో తప్పుల సవరణకు అవకాశం

రాజాం సిటీ: ఈ ఏడాది సాగుచేస్తున్న పంటలకు సంబంధించి ఈ–క్రాప్ చేయించుకున్న రైతుల వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిచేసేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని ఏఓ ఎం.రేణుకాసాయి అన్నారు. కంచరాం గ్రామంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ–క్రాప్ చేయించుకున్న రైతుల జాబితాను చదివి వినిపించారు. ఈ–క్రాప్ నమోదు జాబితాలు అన్ని ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు వారి వివరాలు సరిచూసుకోవాలని, అభ్యంతరాలు ఉంటే 29లోగా సరిచేసుకోవాలని సూచించారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

- గృహ నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్

తెర్లాం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన ఒక్కో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పరిధిలో ఏయే స్టేజ్‌లలో ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయో, వాటిని వచ్చే వారంలోగా స్టేజ్ అప్‌డేషన్ చేసేలా లబ్ధిదారులతో మాట్లాడాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఇచ్చిన వారపు లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, జగనన్న ఇళ్ల లేఅవుట్లలో నిర్మించిన ప్రతీ ఇంటి వద్ద ఇంకుడుగుంతల నిర్మాణాలను తప్పనిసరిగా చేపట్టాలన్నారు. గృహ నిర్మాణాలు పూర్తయిన



ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న హౌసింగ్ జిల్లా పీడీ శ్రీనివాస్

ప్రతీ ఇంటికి మరుగుదొడ్ల బిల్లుల చెల్లింపుల్లో ఎటువంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏయే గ్రామ సచివాలయాల్లో ఇళ్ల నిర్మాణాల్లో వెనుకంజలో ఉన్నారో ఆయా సచివాలయాలపై ప్రత్యేక దృష్టిని సారించి, గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ బొబ్బిలి డీఈఈ పి.అప్పయ్య, తెర్లాం హౌసింగ్ ఏఈ ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈఏఎస్ సర్వే సక్రమంగా నిర్వహించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో త్రినాథరావు

తెర్లాం: మండలంలో నవంబరు 3వ తేదీన జరగనున్న రాష్ట్ర స్థాయి విద్యాసామర్థ్యాల మదింపు సర్వే(ఎస్ఈఏఎస్)ను ప్రధానోపాధ్యాయులు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్, సీఆర్‌పీలు సక్రమంగా నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాధరావు సూచించారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, క్షేత్ర పరిశీలకులు, సీఆర్‌పీలకు సర్వే నిర్వహణపై రెండో విడత శిక్షణ ఇచ్చే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన మొత్తం 23 పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు రాష్ట్రస్థాయి విద్యాసామర్థ్యాల మదింపు సర్వేను చేపట్టనున్నామన్నారు. ఈ సర్వే ద్వారా విద్యార్థుల విద్యాప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ హెచ్‌ఎం సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఎంఈవో–2 పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలను వినియోగించుకోండి

రాజాం: ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఎంపీపీ లావేటి సులోచన అన్నారు. మండలంలోని గడిముడిదాం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ప్రజలతో సమావేశమై మాట్లాడారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శనివారం ఉదయం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. స్పెషలిస్ట్ వైద్యులు వచ్చి అన్నిరకాల వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, సర్పంచ్ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి ఎస్‌వీకే ప్రసాద్, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు గుడిముడిదాంలో..

రాజాం సిటీ: 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాల్లో అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు కోరారు. మండలంలోని గుడిముడిదాం గ్రామంలో శనివారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. శిబిరంలో అందించే వైద్యసేవలపై శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, ఈఓపీఆర్డీ వి.శ్రీనివాసరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



రాజాం సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రచార పత్రాలు అందిస్తున్న ఎంపీడీఓ

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

రాజాం సిటీ: స్థానిక శాస్తాసమాజంలో అయ్యప్పస్వామి భక్తులు శుక్రవారం గణపతిహోమం చేపట్టారు. అయ్యప్పస్వామి మండల దీక్షకు ముందు ఏటా గణపతిహోమం చేయడం ఆనవాయితీగా వస్తోందని గురుస్వాములు శేషు, వంశీ తెలిపారు. ఈ నెల 29 నుంచి మండల దీక్షలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అయ్యప్పభక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.